కథా నిలయం

# కిస్ * కిడ్నాప్

శ్రీకాకుళం

సీట్లో కూర్చుని పది నిమిషాలైనా కాలేదు. మొబైల్ మోగింది. సిస్టమ్ ముందు నుంచి కొంచెం వెనక్కి జరిగి, మొబైల్ తీశాడు దినేష్.

అవతలి వైపు నుంచి అవంతి గొంతు గాభరాగా పలికింది "ఏవండీ... మీరు వెంటనే ఇంటికి రావాలి. చాలా అర్జంట్".

అరగంట క్రితమే అశోక్‌నగర్‌లోని తమ అపార్ట్‌మెంట్ నుంచి బయలుదేరిన దినేష్‌కి ఏం అంతుబట్టలేదు."అవంతీ... అసలేం జరిగింది" అన్నాడు కన్ఫ్యూజన్‌లో.

"అవన్నీ వచ్చాక చెబుతాను - ముందు మీరు బయలుదేరిరండి" అవతల ఫోన్ కట్ చేసిన శబ్దం.

* * *

ముందుగదిలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్, యస్.ఐ., ఇద్దరు కానిస్టేబుళ్లు చాలా సీరియస్‌గా ఆలోచిస్తున్నారు.

ఎదురుగా అవంతి... ఏడ్చి ఏడ్చి కళ్లు ఎర్రగా ఉబ్బిపోయాయి. దినేష్ ఆమె పక్కనే కూర్చున్నాడు దీర్ఘంగా ఆలోచిస్తూ.

"దినేష్‌గారూ, మీరు మన సిటీలో మంచి పేరున్న వ్యక్తి. మంచి రియల్ ఎస్టేట్ ప్రమోటర్‌గా పేరు తెచ్చుకున్నారు. ప్రొఫెషన్‌లో మీకు ప్రత్యర్థులు వుండే అవకాశంవుంది. అలా ఎవరి మీదైనా మీకు అనుమానం వుందా?" అడిగాడు సిఐ.

ఆలోచనలో పడ్డాడు దినేష్. తన పని తాను చూసుకోవడం తప్ప ఇతరుల విషయం ఎన్నడూ పట్టించుకునే అలవాటులేదు తనకి. అలాంటిది ఇంతకు తెగించే ప్రత్యర్థులు తనకు వున్నారా? ఎంతకీ అంతుబట్టలేదు. అదే చెప్పాడు. అరగంట కూర్చున్న తర్వాత కంప్లైంట్ తీసుకుని వెళ్ళిపోయారు పోలీసులు మళ్లీ వస్తామంటూ.

అవంతి, దినేష్ మాత్రమే మిగిలారు. భుజం మీద చెయ్యివేసి, అసలెలా జరిగిందని అడిగాడు అవంతిని. అంతే... ఆమె దుఃఖం చెలియలికట్ట దాటింది.

పది నిమిషాల తర్వాత తమాయించుకుని చెప్పడం మొదలుపెట్టింది.

ఆ రోజే టెన్త్ రిజల్ట్స్ వచ్చాయి. కష్టపడి, స్వయంకృషితో తొంభై అయిదు శాతం మార్కులు తెచ్చుకున్నాడు ఒక్కగానొక్క కొడుకు పవన్. దినేష్, అవంతి ఎంతో సంతోషించారు. ఆ సంతోష సమయంలో ఫ్రెండ్స్‌ని కలిసొస్తానని బయటకు వెళ్ళాడు.

అలా వెళ్ళిన అతడిని ఎవరో మారుతి ఆమ్నీలో ఎక్కించుకు వెళ్లినట్లు చెప్పాడు బెంజ్ సర్కిల్ దగ్గర పండ్ల వ్యాపారి. పవన్ తన ట్యూషన్ మాస్టారు కోసం పండ్లు కొంటూంటే, సర్రున మారుతి ఆపి, గబుక్కున లాక్కెళ్ళారని చెప్పాడు.

పోనీ ఏ "గ్యాంగైనా" డబ్బుకోసం చేసిం

**డా॥ ప్రసాద్ కల్లూరి**

దనుకుంటే, పవన్ బిలియనీర్ బిడ్డ కాదు. రీజనబుల్‌గా రిచ్ ఫ్యామిలీ.

పొలిటికల్‌గా చూద్దామన్నా, దినేష్‌కి పొలిటికల్ ఇంట్రెస్ట్ లేదు. ఎవరితోనూ సంబంధాలూ లేవు. అలాంటిది తన కొడుకును కిడ్నాప్ చేయాల్సిన అవసరం ఎవరికి వుంది? ఎంతలా ఆలోచించినా అంతుబట్టలేదు.

అంతలో మ్రోగుతున్న మొబైల్ వైపు అసహనంగా చూశాడు దినేష్, ఏదో తెలియని నంబర్.

"దినేష్ గారాండీ?" అవతలి నుంచి ఓ ఆడగొంతు...

"అవునండీ, మీరు...?" అసంపూర్తిగా ఆగిపోయాడు.

"సార్, మేమెవరో మీకు తర్వాత తెలుస్తుంది. మేం చెప్పేది జాగ్రత్తగా వినండి. మీ పవన్ మాదగ్గర క్షేమంగా వున్నాడు" ఆవిడ మాట ఇంకా పూర్తి కాలేదు, అలర్టయ్యాడు దినేష్.

"అలాగా, అసలెవరు మీరు? మా అబ్బాయిని ఎందుకు తీసుకు వెళ్ళారు?" ఆదుర్దాగా అడిగాడు దినేష్. శ్రద్ధగా వినసాగింది అవంతి.

"అవన్నీ మీకు తెలియాలంటే మేం చెప్పినట్లు చేయండి. ఓ గంట తర్వాత నంబర్ ప్లేట్ లేని ఓ స్కోడా మీ ఇంటి ముందు ఆగుతుంది. మీరు, మీ శ్రీమతి ఓ అరవైవేలు తీసుకుని మాట్లాడకుండా కారు ఎక్కండి. మిగతా విషయాలు మా మనుషులు చూసుకుంటారు.

మీకో హెచ్చరిక... మీరు మాత్రమే కార్లో వస్తే మీ పవన్‌ని చూడగలుగుతారు. ఓవర్ స్మార్ట్‌గా ఆలోచించవద్దు. మీ ఇంట్లో ఏం జరుగుతున్నదీ లైవ్‌లో మేం చూస్తున్నాం. ఎంత వెదికినా మీకు కనబడని సీక్రెట్ కెమేరా సెట్ చేశాం. ఇప్పటికే పోలీసులు వచ్చి వెళ్ళారని మాకు తెలుసు. మరో పొరబాటు చేయకండి.

హలో... మీ మొబైల్‌లో వచ్చిన నంబర్ ట్రాక్ చేయాలని ప్రయత్నించవద్దు. ఈ క్షణమే ఆ నంబర్‌ని మార్చేస్తున్నాం. ఫోన్ పెట్టేసిన శబ్దం.

నిస్సహాయతతో దినేష్ దవడ కండరం బిగుసుకుంది. ఎలాగైనా తన కొడుకును క్షేమంగా చూడాలని కోరిక.

అవంతి అచేతనంగా కూర్చుండిపోయింది.

ఒక ఖచ్చితమైన నిర్ణయానికి వచ్చినట్టు తన ఆఫీస్‌రూంలోకి వెళ్ళి, తన బ్రీఫ్ తెరిచాడు దినేష్. కావలసినదేదో జేబులో పెట్టుకున్నాడు.

సరిగ్గా గంట తర్వాత వినబడింది స్కోడా హారన్. ముందుగా లేచిన దినేష్ తప్పదన్నట్టు సైగచేశాడు అవంతికి. కామ్‌గా డోర్ తీసి పట్టుకున్నాడు ఓ ఆగంతకుడు.

కారు బయలుదేరిన పావుగంట తర్వాత దినేష్, అవంతిల కళ్లకు గంతలు కట్టిందో పాతికేళ్ళ పడతి. "ఇదంతా ఎందుకు?" అడిగాడు దినేష్. మా బాస్‌కు పాత సినిమాలే ఇన్‌స్పిరేషన్" అంది ముక్తసరిగా.

కొంత దూరం వెళ్లాకా తెలుగు "పాత సినిమాలో" మాదిరిగా మూడుసార్లు కారుని గుండ్రంగా త్రిప్పి సడన్ బ్రేక్‌తో ఆపాడు "నల్ల" కళ్లజోడు పెట్టుకున్న డ్రైవర్.

కళ్లకున్న గంతలు తొలగించిందా ఇంతి. ఎదురుగా ఓ అయిదు అంతస్తుల భవనం. చుట్టూ ఎత్తుగా ప్రహరి, కోట గుమ్మంలాంటి గేటు.



స్టేట్ ఫస్ట్ ర్యాంక్
AVM

పూర్తిగా కన్‌ఫ్యూజ్డ్ కండిషన్‌లో వున్న దినేష్, అవంతి మెల్లగా కారు దిగారు.

అంతలో గ్యాస్ సిలెండర్స్ డెలివర్ బాయ్స్ యూనీఫారం వంటి దుస్తులు వేసుకున్న ఇద్దరు యువకులు పరిగెత్తుకొచ్చారు కారు దగ్గరకు. ఫార్ములా ప్రకారం వాళ్ల చేతుల్లో మెషీన్‌గన్స్ వూహించుకున్న అవంతి కాస్త నిరాశకు గురైంది. మెల్లగా అదే మాట చెప్పింది దినేష్ చెవిలో. ఉరిమిచూశాడు దినేష్. ఆ యువకులను ఫాలో అయ్యారు దినేష్, అవంతి. అరవై అడుగుల పొడవు, నలభై అడుగుల వెడల్పు హాలు. జైగాంటిక్‌గా వున్న మెహగొనీ టేబుల్, గ్రానైట్ ఫ్లోరింగ్, సెంట్రలైజ్డ్ ఏ.సి. అటువైపు ఎత్తైన రివాల్వింగ్ ఛైర్, ఇటువైపు జైగాంటిక్ సింగిల్ సోఫాలు...

డెన్‌ను ఇంకోలా వూహించుకున్న అవంతి ఈసారి కూడా నిరుత్సాహపడక తప్పలేదు.

సోఫాలో కూర్చున్న వెంటనే చల్లని డ్రింక్స్ సర్వ్ చేశారు. తాగాలా, వద్దా అనుకుంటున్న వాళ్లతో... ఏం ఫరవాలేదని సైగచేశాడు బేరర్ దుస్తుల్లో వున్న ఆగంతకుడు.

రామంతపూర్ స్టూడియోకొచ్చి, సప్తగిరి ఛానెల్ చూడటానికి భయపడినట్టు... లాభం లేని ఆలోచనలు ఆపుకుని, గడగడా తాగేశారు.

ఇంతలో అడుగుల చప్పుడు వినబడటంతో తలెత్తి చూశారు దినేష్, అవంతి.

ఆరడుగుల ఆజానుబాహుడు, డెలివరీ బాయ్స్ వేసుకున్న సూట్ లాంటిదే వేసుకుని ప్రత్యక్షమయ్యాడు, రివాల్వింగ్ ఛైర్‌లో. అతని వెనకాలే వచ్చి నిల్చుంది పి.ఎ. ఆమె సలహా మీద దినేష్, అవంతి తమను తాము పరిచయం చేసుకున్నారు.

ఓసారి గొంతు సవరించుకుని, కుడి భుజం ఎగరేశాడు ఆరడుగుల ఆగంతకుడు.

"రెస్పెక్టెడ్ దినేష్, మేడమ్ అవంతీ... వెల్‌కం ఇంటు అవర్ మిడ్‌స్ట్.

బైదవే, నా పేరు సి.ఆర్.కె... అకడమిక్ డైరెక్టర్‌ని" క్షణం ఆగాడు. కుడిభుజం ఎగిరి పడింది.

తమని ఓ అకడమిక్ డైరెక్టర్ ఎందుకు రప్పించాడో అంతుబట్టలేదు దినేష్‌కి.

అంతలో సిఆర్‌కె బజర్ నొక్కడం, ఇద్దరు యువకులు లోపలికి వెళ్ళి, పవన్‌ని వెంటబెట్టుకు రావడం క్షణాల్లో జరిగిపోయాయి.

కళ్లప్పగించి చూడటం అవంతి, దినేష్‌ల వంతు అయింది. అందుకు కారణం...

అప్పటిదాకా వాళ్ల దగ్గర బందీగా వున్న పవన్ తమని చూసిన వెంటనే తెలుగు సినిమాలోలాగా స్లోమోషన్‌లో పరిగెత్తివచ్చి, భుజం మీద తలపెట్టి ఏడుస్తాడనుకున్నారు.

అందుకు భిన్నంగా డైట్‌కోక్ సిప్ చేస్తూ, మరోచేత్తో పాప్‌కార్న్ ప్యాకెట్‌తో ప్రత్యక్షమయ్యాడు. అతనికోసం సిఆర్‌కె దగ్గరగా మరో సీట్ వేశారు. పలకరింపులు పూర్తయ్యాయి.

అప్పుడు అసలు విషయానికొచ్చాడు సిఆర్‌కె.

"దినేష్‌జీ, మాది చైతన్యశ్రీ రెసిడెన్షియల్ కాలేజ్. గత పదహారు సంవత్సరాలుగా విద్యా బోధనలో రికార్డ్స్ నెలకొల్పాము.

మీకు తెలుసుగదా ఈ కాంపిటీషన్. అదీ కాక టెన్త్ రిజల్ట్స్ వచ్చాయి. మాలాగే ఇతర కాలేజీలు కూడా పిల్లల్ని "ఎగరేసుకుపోతారు" అన్న విషయం మాకు బాగా తెలుసు. స్ట్రెంత్

కావాలంటే నానా గడ్డీ కరవక తప్పదు. ఈ విషయంలో మాకు ఎంతో అనుభవం వుంది.

మరోసారి కుడిభుజం ఎగరేశాడు. గొంతు సవరించుకుని కంటిన్యూ చేశాడు...

పోటీ తట్టుకోవడానికి ఎప్పటికప్పుడు నూతన విధానాలను ప్రవేశపెట్టే మేము "కిడ్స్ కిడ్నాప్" అన్న ఫార్ములాని ప్రయోగిస్తున్నాం. అదేమిటంటే, ముందుగా మెరిటోరియస్ పిల్లల్ని మా వాళ్లు కిడ్నాప్ చేస్తారు.

తర్వాత మా పి.ఎ. మీకు చేసినట్టే, మిగతా వాళ్లకూ ఫోన్ చేసి అరవైవేలు తీసుకురమ్మని, కారు పంపుతుంది.

థీమ్ అంతా అర్థమయింది కనుక ఓ పని చెయ్యండి. "అప్లికేషన్ ఫిల్ చేసి, మీ పవన్‌ని మా రెసిడెన్షియల్‌లో చేర్పించండి. బెస్ట్ రిజల్ట్ ఇస్తాం ఇంటర్లో" ముగించాడు సిఆర్‌కె.

అప్పటికి గానీ అర్థంకాలేదు దినేష్‌కి అసలు విషయం. అంతా విన్న అవంతి అచేతనంగా వుండిపోయింది.

"చూడండి సిఆర్‌కె! నాకు తెలియక అడుగుతున్నాను... నైన్టీఫైవ్ పర్సెంట్ వచ్చిన మా అబ్బాయికి ఏ కాలేజీలోనైనా సీటిస్తారు ఫ్రీగా. అలాంటిది... అరవైవేలు కట్టి చేర్పించాల్సిన అవసరం మాకేంటి?" అడిగాడు కోట శ్రీనివాసరావులా పోజిచ్చి.

"చెప్తా వినండి... మీ అబ్బాయికి నిజానికి మేం ఏమీ ఫీజు కట్టించుకోవడం లేదు. మరి ఈ అరవై వేలంటారా?! దీన్ని మీ, మా జాయింట్ అకౌంట్‌లో బ్యాంక్‌లో వేస్తాం. రెండు సంవత్సరాల్లో బాగా పెరుగుతుందిగదా. ఆ డబ్బుతో హైద్రాబాద్‌లో వున్న రామోజీ ఫిల్మ్‌సిటీలో మా "పరపతితో" పవన్‌కి సన్మానం చేయిస్తాం, ఇంటర్ రిజల్ట్స్ వచ్చాక. "ఇప్పుడే అతని రిజల్ట్ ఎలా వుంటుందో మేం ఎలా చెప్పగలం?" అని మీరు అనుకోవచ్చు. అదో టాప్ సీక్రెట్.

అవంతి ఎక్కడికో వెళ్ళిపోయింది. పవన్‌కి స్టేట్‌ర్యాంక్ వచ్చినట్టు, ఫిల్మ్‌సిటీలో సన్మానించబడుతున్నట్టు, ఈటీవీలో తను ఇంటర్వ్యూ ఇస్తున్నట్టు... దినేష్ పరిస్థితి కూడా దాదాపు అలానే వుంది.

వాళ్లు ఆ హిప్నాటిక్ ట్రాన్స్‌లో వుండగానే, పవన్ చేత అప్లికేషన్ ఫిలప్ చేయించింది పి.ఎ., మనీ కట్టేశారు.

సిఆర్‌కె కల్పించుకుని, గిఫ్ట్ ప్యాక్ చేసిన ఓ వస్తువుని దినేష్ చేతికి అందించాడు.

"దినేష్‌గారూ, మా అంతరంగికులకు మాత్రమే ఈ ప్రివిలేజ్ వుంది. ఇంటికి వెళ్ళాక ఓపెన్ చేయండి. థాంక్యూ" అంటూ సాగనంపాడు.

తిరిగి కళ్లకు గంతలు, స్కోడాలో రైడ్... అన్నీ తెలిసాక ఎందుకన్నాడు దినేష్. ఫార్ములా కోసమంది పడతి.

ఇంటికి రావడం ఆలశ్యం, ఆదుర్దాగా దినేష్ చేతిలోవున్న గిఫ్ట్‌ప్యాక్ తీసుకుని, ఓపెన్ చేసింది అవంతి.

అది లేటెస్ట్ మోడల్ నోకియాసెల్. దాంతో పాటే నంబర్ వివరాలున్న చిన్న స్లిప్.

పైగా ఆ నంబర్ డయల్ చేస్తే, సరాసరి సిఆర్‌కెతో మాట్లాడొచ్చన్న నోట్.

అప్పుడర్థమయ్యింది దినేష్‌కి కార్పొరేట్ కాలేజీల స్ట్రాటజీ. అతనికి అనిపించింది... "సిఆర్‌కె తలచుకుంటే ర్యాంకులకు కొదవా?" అని. ●